క్లుప్తంగా

పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలి

నిజామాబాద్ అర్బన్: పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలని ఎస్టీయూటీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వత రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జూలై 1 నుంచి కొత్త పీఆర్‌సీ అమలు చేయాలన్నారు. అలాగే మధ్యంతర భృతిని ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంవత్సరం కాలంగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని, డీఏలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలలు పునఃప్రారంభం నాటికి ఏకరూప దుస్తులు, బుక్స్ విద్యార్థులకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి ధర్మేందర్, రాష్ట్ర సెక్రెటరీ పోల్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి రమేశ్, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

నాగారం 80 క్వార్టర్స్‌లో బడిబాట



నిజామాబాద్‌అర్బన్: నగరంలోని జెండా గల్లీ పాఠశాల పరిధిలోని నాగారం 80 క్వార్టర్స్‌లో బడిబాట నిర్వహించారు. గురువారం ఎన్‌రోల్‌మెంట్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ముగ్గురు పిల్లలను అడ్మిషన్లు ఇప్పించారు. విద్యానగర్ కాలనీలో గల 110 అంగన్‌వాడి కేంద్రాన్ని సందర్శించి బడిఈడు పిల్లల్ని గుర్తించారు. సర్వేలో ప్రధానోపాధ్యాయులు రామచందర్ గైక్వాడ్, ఉపాధ్యాయులు మంజుల, నరేష్, శ్రీనివాస్, శైలజ పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన



డిచ్‌పల్లి: భారత సాఫ్ట్‌బాల్(అండర్- 15) జట్టుకు ఎంపికైన గురుకుల క్రీడాకారులను సంస్థ ప్రాంతీయ సమన్వయాధికారిణి(ఆర్‌సీవో) మేరీ ఏసుపాదం అభినందించారు. డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల ప్రాంతీయ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఎంపికైన క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆర్‌సీవో మాట్లాడుతూ.. భారత సాఫ్ట్‌బాల్ జట్టులో నిజామాబాద్ జిల్లా నుంచి ఐదుగురు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినులు గోక సాత్విక, గోక శ్రావిక, గుగులోతు సౌందర్య(సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, సుద్దపల్లి), దాసరి సరయు (సాంఘిక సంక్షేమ పాఠశాల, ధర్మారం(బి)), సుంకపాక సౌమ్యరాణి (సాంఘిక సంక్షేమ కళాశాల, తాడ్వాయి) ఎంపిక కావడం సంతోషకరమైన విషయమన్నారు. ఈ నెల 13 నుంచి 17 వరకు తైవాన్ దేశంలోని తైపీలో జరిగే ఏషియన్ ఛాంపియన్‌షిప్ పోటీలలో భారత జట్టుని ప్రథమ స్థానంలో నిలపడానికి కృషి చేయాలని సూచించారు. ఎంపికైన ఐదుగురు రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అకాడమీలో ప్రత్యేక శిక్షణ పొందుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ నీరజా రెడ్డి, తాడ్వాయి వ్యాయామ ఉపాధ్యాయురాలు సంధ్య, సాఫ్ట్‌బాల్ అకాడమీ కోచ్‌లు వేముల మౌనిక, ఇట్యాల నరేష్‌లు తదితరులు పాల్గొన్నారు.

చలో ఉస్మానియాను విజయవంతం చేయండి

తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం(9న) ఉస్మానియా యూనివర్సిటీలో రాష్ట్ర మహాసదస్సు నిర్వహిస్తున్నారని తెలంగాణ యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులు తెలిపారు. రాష్ట్ర జేఏసీ ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కాలేజ్‌లో నిర్వహిస్తున్న ఈ మహా సదస్సులో ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి సుదర్శన్ రెడ్డి, తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, ప్రముఖ విద్యావేత్త, రిటైర్డ్ ప్రొఫెసర్ హరగోపాల్ హాజరవుతారని తెలిపారు.

నోట్ పుస్తకాల అందజేత



ధర్పల్లి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందించే ఉచిత నోటు పుస్తకాలను గురువారం ధర్పల్లి మండల విద్యా వనరుల కేంద్రంలో ఇన్‌చార్జి ఎంఈవో శ్రీనివాస రెడ్డి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఈ నెల 12న పాఠశాల ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యార్థులకు ఉచిత పుస్తకాలు పంపిణీ చేయడానికి ప్రధానోపాధ్యాయులకు అందజేసినట్లు ఎంఈవో పేర్కొన్నారు.

ఘనంగా చెరువుల పండుగ



న్యాల్‌కల్‌లో చెరువు వద్ద కొబ్బరికాయ కొడుతున్న సర్పంచ్ గంగాప్రసాద్, తదితరులు



సిర్పూర్‌లో బతుకమ్మలతో మహిళలు, సర్పంచ్ ముత్యంరెడ్డి, తదితరులు

తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం చెరువుల పండుగను రూరల్, అర్బన్ నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. అంతకుముందు బోనాలు, బతుకమ్మలతో చెరువుల వద్దకు గ్రామస్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. స్థానికంగా ఉన్న ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. చెరువులకు కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. – సాక్షి నెట్‌వర్క్



చంద్రాయన్‌పల్లిలో బతుకమ్మలతో మహిళలు



నిజామాబాద్ రూరల్ మండలం మల్లారంలో..



ధర్పల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



జక్రాన్‌పల్లి మండలం పడకల్‌లో..



సిరికొండలో బోనాలు, బతుకమ్మలతో ఊరేగింపుగా వెళ్తున్న ప్రజాప్రతినిధులు



అమృతాపూర్‌లో వల గొడుగు, బతుకమ్మలు, బోనాలతో ఊరేగింపుగా..

తెలంగాణ సస్యశ్యామలమవుతోంది



బతుకమ్మలను తీసుకొస్తున్న మహిళలు



సమావేశంలో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే

నిజామాబాద్‌నాగారం: సీఎం కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ రాష్ట్రం సస్యశ్యామలంగా మారుతోందని, నాడు సమైక్య పాలనలో చెరువులను పట్టించుకోలేదని అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా పేర్కొన్నారు. గురువారం అర్సపల్లిలో చెరువుల పండుగ కార్యక్రమంలో పాల్గొని బతుకమ్మ ఆడారు. కట్ట మైసమ్మ తల్లికి బోనం సమర్పించి చెరువు వద్ద పూజలు చేశారు. అర్బన్ ఎమ్మెల్యే మాట్లాడుతూ..చెరువులో నీరు ఉంటేనే ఊరు పచ్చగా ఉంటుందన్నారు. సీఎం కేసీఆర్ మిషన్ కాకతీయ ద్వారా రాష్ట్రంలో 47 వేల చెరువుల్లో పూడిక తీసి పునరుద్ధరణ చేశారని అన్నారు. నీరు వృథా కాకుండా గొలుసుకట్టు విధానంతో చెరువుల్లో నీటిని నింపారని గుర్తు చేశారు. కాళేశ్వరం, ఇతర బహుళార్థ సాధక నీటి ప్రాజెక్టులు నిర్మించి తెలంగాణ రైతాంగానికి వెన్నెముకగా నిలిచారన్నారు. రైతు సంక్షేమ కార్యక్రమాల ద్వారా తెలంగాణ రాష్ట్రం దేశానికి అన్నం పెట్టే అన్నపూర్ణగా మారిందన్నారు. ప్రభుత్వం వంద శాతం సబ్సిడీతో చేప పిల్లలను అందిస్తోందని, వీటి ద్వారా మత్స్యకారులకు ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూ కిరణ్, నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ ముచుకుర్ లావణ్య, సీనియర్ నాయకులు నవీన్, రైతు విభాగం అధ్యక్షుడు చెగంటి గంగాధర్, సిర్ప రాజు, కులాచారి సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమానికి కృషి



కండువాలు కప్పుతున్న అర్బన్ ఎమ్మెల్యే

నిజామాబాద్‌నాగారం: సీఎం కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నారని అర్బన్ ఎమ్మెల్యే గణేశ్ గుప్తా అన్నారు. గురువారం ఎమ్మెల్యే సమక్షంలో సుమారు 200 మంది ఇందూర్ వాటర్ పంప్ మెకానిక్ అసోసియేషన్ సభ్యులు బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు పార్టీలోకి ఆహ్వానించారు. నూతనంగా ఎన్నికై న నగర ఇందూర్ వాటర్ పంప్ మెకానిక్ అసోసియేషన్ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అర్బన్ ఎమ్మెల్యే గణేష్‌గుప్తా మాట్లాడుతూ.. నిజామాబాద్ నగరంలో జరుగుతున్న అభివృద్ధి - సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. నిజామాబాద్ ప్రాంత యువతకు ఉపాధి అందించడమే ప్రథమ కర్తవ్యమన్నారు. నగరంలో ఆర్‌యూబీ నిర్మించి ట్రాఫిక్ కష్టాలు తీర్చామన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను యుద్ధ ప్రాతికన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. అసోసియేషన్ సభ్యులకు ఏ సమస్య వచ్చినా ఒక సోదరుడిలా అండగా ఉంటానన్నారు. నగర మేయర్ దండు నీతూ కిరణ్, నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, కార్పొరేటర్లు అబ్దుల్ కుద్దుస్, బాబ్ల్యూ ఖాన్, సాయివర్ధన్, విక్రమ్ గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

18 వరకు దరఖాస్తు గడువు పొడిగింపు

మాజీ మేయర్ ధర్మపురి సంజయ్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సంజయ్

సుభాష్‌నగర్: హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ స్ఫూర్తిగా తెలంగాణ యువశక్తిని మేల్కొలిపే దిశగా ప్రవేశపెట్టిన రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్‌కు దరఖాస్తు చేసుకునేందుకు గడువు జూన్ 18 వరకు పొడిగించినట్లు మాజీ మేయర్, కాంగ్రెస్ నాయకులు ధర్మపురి సంజయ్ తెలిపారు. గురువారం నగర శివారులోని విజయ్ రూరల్ ఇంజనీరింగ్ కళాశాలలో యువతకు క్విజ్ పోటీలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ.. యువత కోసం కాంగ్రెస్ ప్రభుత్వం తలపెట్టిన యూత్ డిక్లరేషన్, కాంగ్రెస్ విధివిధానాల గురించి తెలుసుకోవాలని సూచించారు. క్విజ్‌లో అందరూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోండి

నిజామాబాద్‌అర్బన్: గుర్తింపులేని ప్రయివేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ స్టేట్ జాయింట్ సెక్రెటరీ మనోజ్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం మనోజ్ మాట్లాడుతూ.. జిల్లాలో అనుమతి లేకుండా నడుస్తున్న ప్రయివేటు పాఠశాలలు, అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులను మోసం చేస్తూ అడ్మిషన్లు చేస్తున్నారని ఆరోపించారు. ఏబీవీపీ నాయకులు దామ సునీల్, రోహిత్, సాయి ఉన్నారు.

రాష్ట్ర అభివృద్ధి దేశానికి ఆదర్శం



సంబరాల్లో ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి తదితరులు

ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్

నిజామాబాద్ సిటీ: తెలంగాణ రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి దేశానికి ఆదర్శంగా నిలిచిందని ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. గురువారం చెరువుల పండుగ కార్యక్రమంలో భాగంగా నిజామాబాద్ రూరల్ మండలం కాలూర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిపై కాంగ్రెస్, బీజేపీ నేతలు విషం చిమ్ముతున్నారని, ఓర్వలేక ఇలాంటివి మాట్లాడుతున్నారని విమర్శించారు. కేసీఆర్ చేసిన అప్పు రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగించారని, అదే ప్రధాని నరేంద్ర మోడీ చేసిన అప్పు దేనికి ఖర్చు పెట్టారో తెలియదన్నారు. జిల్లా ఒలింపిక్ సంఘం ఉపాధ్యక్షుడు బాజిరెడ్డి జగన్, సాంబారి మోహన్, నుడా డైరెక్టర్ సంతోష్, కార్పొరేటర్ కోర్వ లలిత తదితరులు పాల్గొన్నారు.

భర్త అకాల మరణం.. భార్య స్వీపర్‌గా నియామకం



బాధితురాలు లతతో మాట్లాడుతున్న జగన్

జక్రాన్‌పల్లి: పుప్పాలపల్లి గ్రామానికి చెందిన రేవెల్లి గంగాధర్ ఇటీవల అకస్మాత్తుగా మృతిచెందారు. గంగాధర్‌కు భార్యతో పాటు ఏడేళ్ల లోపు ముగ్గురు కుమారులున్నారు. భర్త మరణించడంతో పిల్లలను సాకడం భారంగా మారింది. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ దృష్టికి తీసుకువెళ్లగా ఆమెను గ్రామ పంచాయతీ స్వీపర్‌గా నియమించారు. జిల్లా ఆర్థిక ప్రణాళిక సభ్యుడు బాజిరెడ్డి జగన్ బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ధైర్యంగా ఉండాలని, కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని తెలిపారు. పిల్లల చదువుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సర్పంచ్ దావుల పోసాని సంతోష్, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మీ ప్రకాశ్ ఉన్నారు.

ఈ నెలలోనే 'గృహలక్ష్మి' ప్రారంభం

మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



పడగల్‌లో ఇళ్లను పరిశీలిస్తున్న మంత్రి

వేల్పూర్: సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ఈ నెలలోనే గృహలక్ష్మి పథకం ప్రారంభమవుతుందని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన వేల్పూర్ మండలం పడగల్, బాల్కొండ మండల కేంద్రంలో నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల ఆత్మగౌరవ ప్రతీకగా సీఎం కేసీఆర్ డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మిస్తున్నారని చెప్పారు. బాల్కొండ నియోజకవర్గంలో మొత్తం పది ప్రాంతాల్లో 1,200 ఇళ్ల నిర్మాణంలో ఉన్నాయని, ఇప్పటికే 800 ఇళ్లు పూర్తయినట్లు చెప్పారు. మరో 400 ఇళ్లు పురోగతిలో ఉన్నాయని, అవి కూడా త్వరలో పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 2 లక్షల ఇళ్లు పేదలకు నిర్మించి ఇచ్చామని, గృహలక్ష్మి ద్వారా మరో 3 లక్షల ఇళ్లు ఇవ్వబోతున్నట్లు చెప్పారు.

రూ.లక్ష ఆర్థిక సహాయానికి దరఖాస్తులు చేసుకోవాలి

ఇందల్వాయి: వెనకబడిన కులాలు, చేతివృత్తులు చేసుకుంటూ జీవనం సాగించే వారికి ఆర్థిక చేయూత అందించేందుకు ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సాయం ఇవ్వనుందని అర్హులైనవారు మీ-సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో రాములు నాయక్ గురువారం తెలిపారు. 18 ఏళ్ల నుంచి 55 ఏళ్ల మధ్య వయసున్న అర్హుల నుంచి ఈ నెల 6 నుంచి 20 వరకు మాత్రమే దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అనంతరం దరఖాస్తు పత్రాలతో పాటు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డ్, రేషన్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్‌లను మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

సమాచారం..

నేడు డిచ్‌పల్లిలో సంక్షేమ దినోత్సవం

డిచ్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం డిచ్‌పల్లి మండల కేంద్రంలోని జీ కన్వెన్షన్‌లో నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ స్థాయి 'సంక్షేమ దినోత్సవ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో రవి గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీఎస్ ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ హాజరవుతారని తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే సంక్షేమ దినోత్సవ కార్యక్రమం మధ్యాహ్నం 1 గంటకు భోజనం చేయడంతో ముగుస్తుందన్నారు.

డిచ్‌పల్లి మండల సర్వసభ్య సమావేశం

డిచ్‌పల్లి: స్థానిక ఎంపీపీ గద్దె భూమన్న అధ్యక్షతన శుక్రవారం(9న) డిచ్‌పల్లి మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో టీవీఎస్ గోపిబాబు గురువారం తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి జెడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీటీసీలతో పాటు అన్ని విభాగాల అధికారులు పూర్తి నివేదికలతో హాజరు కావాలని ఆయన కోరారు.

13 నుంచి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి విజయ యాత్ర



నిజామాబాద్‌నాగారం: నగరంలో ఈ నెల 13 నుంచి 17 వరకు కంచి కామకోటి పీఠాధిపతులు సద్గురు శంకరాచార్య శంకర విజయేంద్ర సరస్వతి స్వామి విజయ యాత్ర నిర్వహించనున్నట్లు కంచి కామకోటి భక్త బృందం నిర్వాహకులు శ్రీపాద ఫణి చక్రవర్తి, వేలేటి పవన్ శర్మ తెలిపారు నగరంలోని ప్రెస్ క్లబ్‌లో గురువారం వారు మాట్లాడారు. 5 రోజుల పాటు జిల్లా కేంద్రంలోని కిషన్ గంజ్‌లో గల వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో నిర్వహించే కార్యక్రమాల గురించి వారు వివరించారు.

వేసవిలోనూ నిండు కుండల్లా చెరువులు



ఆర్మూర్: సీఎం కేసీఆర్ సంకల్పంతో చేపట్టిన మిషన్ కాకతీయ పనులతో ఆర్మూర్ నియోజకవర్గం పరిధిలోని 220 చెరువులు వేసవి కాలంలో సైతం నిండు కుండలను తలపిస్తున్నాయని ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్మూర్, ఆలూర్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చెరువుల పండుగను గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ.. చెరువుల్లో నీటి నిలువతో మత్స్యకారుల జీవితాల్లో వెలుగు వచ్చిందన్నారు. ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో కట్ట మైసమ్మకు పూజలు నిర్వహించి చెరువులకు జలహారతినిచ్చారు. ఆయా గ్రామాల్లో మహిళలు ఊరేగింపుగా చెరువుల వద్దకు వచ్చి బోనాలను సమర్పించారు. సహపంక్తి భోజనాలు చేశారు. ఆర్మూర్ వైస్ ఎంపీపీ చిన్నారెడ్డి, సర్పంచ్ క్లెం మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	61,600	వెండి (కిలో)	75,600
22 క్యారెట్స్	56,795		

– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	25	50	క్యాప్సికం	60	80
బెండకాయ	30	50	గాజరుగడ్డ	35	50
బీరకాయ	30	50	పచ్చిమిర్చి	50	60
దొండకాయ	20	40	దోసకాయ	15	30
బిర్నీసుకాయ	120	140	ఆలుగడ్డ	20	40
కాకరకాయ	30	50	గోబిగడ్డ	18	40
వంకాయ	20	40	గోబిపువ్వు	25	50
పాలకూర	30	50	బీట్‌రూట్	25	50
మెంతికూర	50	70	గోరు చిక్కుడు	45	60
కొత్తిమీర	50	70	చిక్కుడుకాయ	50	70
పుదీనా	60	80			

– ఇందూరు

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	220
		లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	750

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1 కొాపికేవర్మ- 10.50, విమానం-1.30, 7.30, పరేషాన్-4.30, ఇంటింటి రామాయణం -10.30

స్క్రీన్-2 టక్కర్ -10.50 7.30, మేమ్ ఫేమస్ - 01.35, విమానం -4.30, అన్‌స్టాపబుల్ -10.20

స్క్రీన్-3 ట్రాన్స్‌ఫార్మర్స్ -11.00,4.40, 7.30,10.30,10.40, యూనివర్సిటీ -1.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1 విమానం -11.10,4.50,10.35, జర హట్‌కే జర బచ్‌కే(హిందీ) -1.55, టక్కర్ -7.35

స్క్రీన్-2 టక్కర్ -10.15, 3డీ-ట్రాన్స్‌ఫార్మర్స్(ఇంగ్లీష్) - 1.15, 4.10, 7.05, 10.00

స్క్రీన్-3 అన్‌స్టాపబుల్ -11.10 7.45, పరేషాన్ -1.45, స్పైడర్‌మాన్- (ఇంగ్లీష్) -4.40, మేమ్ ఫేమస్ -10.20

స్క్రీన్-4 కౌశిక్‌వర్మ -11.05, ఇంటింటి రామాయణం -4.20,7.15, జర హట్‌కే జర బచ్‌కే(హిందీ) -10.10

దేవి	బిచ్చగాడు2
నటరాజ్	ట్రాన్స్‌ఫార్మర్స్
లలితామహల్	టక్కర్
విజయ్	అన్‌స్టాపబుల్